నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం సెప్టెంబర్ 16, 2024 www.navatelangana.com

మండలపాల వద్ద హోమం, అన్నదానం

నవతెలంగాణ-నిజామాబాద్

నగరంలోని రోటరీనగర్ రోడ్ నెం.6లో గల శ్రీ విద్య గణేశ్ మండలి వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు. తొలుత హోమం నిర్వహించారు. తదనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. రాత్రి వేళ మండపంలో భజన కార్యక్రమం చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు.


అన్నదానంలో రోటరీనగర్ కాలనీవాసులు

నిండుకుండలా ఎస్సారెస్పీ

నవతెలంగాణ-మెండోర

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లోకి ఎగువ ప్రాంతాల నుండి వరద ప్రవాహం కొనగుతుండగా మిగులు జలాలు దిగువ ప్రాంతాలకు వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఉన్నత అధికారుల సూచనల ప్రకారం - కాకతీయ మెయిన్ కెనాల్ (ఎల్ఎమ్‌డి ఎగువన) ద్వార శనివారం నీటి విడుదల పెంచి 6800 క్యూసెక్కుల నీటిని వదిలి ఆదివారం స్వల్పంగా తగ్గించి 5350 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు లోకి 27 వేల 315 క్యూసెక్కుల వరదనీరు కొనసాగుతుండగా 27 వేల 315 క్యూసెక్కుల మిగులు జలాలు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నుండి దిగువకు విడుదల చేస్తున్న క్రమంలో వరద కాలువకు 19000 క్యూసెక్కులు , లక్ష్మి కాలువకు 200 , సరస్వతి కాలువకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మిషన్ భగీరథ పథకం ద్వార 231 క్యూసెక్కుల తాగునీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు నుండి 684 క్యూసెక్కుల నీరు వృథాగా ఆవిరిఅవుతుండగా ప్రాజెక్టులో ప్రస్తుతం 1091 అడుగులు, 80.501 టిఎంసి ల నీరుపూర్తిస్థాయిలో నిలకడగా ఉన్నట్లు ప్రాజక్టు అధికారులు పేర్కొన్నారు.

చీకటి పాలనకు చరమగీతం

- రేపు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినం
- నాటి పోరాటంలో జిల్లా వాసులు..

నవతెలంగాణ-ఆర్మూర్

నిజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాముల దౌర్జన్యాలు దాడులకు వ్యతిరేకంగా ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులు నాంది పలికారు. స్వతంత్రాన్ని సాధించారు. స్వతంత్రం కోసం అగ్ర భాగాన నిలిచిన పోరాడిన వాళు తమ పేరును చరిత్ర పూటల్లోకి సువర్ణక్షాలతో లిఖించుకున్నారు. ప్రపంచం గుర్తించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితం నిరంకుశత్వానికి చరమగీతం పాడిన 1948 సెప్టెంబర్ 17.. తెలంగాణలో భారతదేశంలో విలీనమైన రోజు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని అమరుల త్యాగాలను మరోసారి స్మరించుకుందాం.

నిజాం పాలనలో కొనసాగిన అరాచకాలు


"ఓ నిజాము పిశాచమా, కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగలను తెంపి అగ్నిలో దింపినావు. నా తెలంగాణ కోటి రతనాల వీణ' నిజాం రాజుకు వ్యతిరేకంగా వరంగల్ జిల్లా మానుకోట తాలూకాలో నిజాం రాజు సమక్షంలో తన గళాన్ని వినిపించారు కవి దాశరథి. ఫలితంగా నిజాం ప్రభు అగ్రహానికి గురై నిజామాబాద్ జిల్లా జైలుకు దాశరథిని తరలించారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వతంత్రం వచ్చిన తెలంగాణ మాత్రం నిజాం పాలనలోనే కొనసాగింది. నిజాం పాలన సందర్భంగా దేశంలో తెలంగాణ విలీనం చరిత్రాత్మక ఘట్టం. బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యం సిద్ధించాక ఇక్కడి ప్రజలు భారత్‌లో కలవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు జరిగిన ఘటనలు రాష్ట్ర ఆవిర్భావం వరకు స్ఫూర్తిగా నిలిచాయి. ఆనాటి ఉద్యమంలో ఇందుకు విడదీయరాని అనుబంధం ఉంది. హైదరాబాద్ రాష్ట్రం నుంచి భారత యూనియన్‌లో విలీనం వరకు ఉమ్మడి జిల్లా వాసులు తమ ప్రాణాలు లెక్కచేయకుండా ఉద్యమించారు. ఆ ఉద్యమ ఆనవాళ్లు తొలి మలిదశ ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచాయి. ఆనాటి ఆనవాళ్లను స్ఫూర్తి కిరణాలుగా మలుచుకోవాల్సిన తరుణమిది.

1933లో ఆంధ్ర మహాసభ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయ ప్రాంగణంలో 1933లో జరిగిన ఆరో ఆంధ్ర మహాసభ నిర్వహణలో కాటిపల్లి రామచంద్రారెడ్డి ముఖ్య పాత్ర పోషించారు. 1934లో ఆర్య సమాజ్ వైదికదర్శి పత్రికతో నిజాం దురాగతలను ప్రచురించారు. దీంతో ఈ పత్రికను నిషేధించారు. తుండిగే నరసింహం 1949లో ముంబాయి ఆంధ్ర సరస్వత పరిషత్ శాఖను నడిపేవాడు. కామారెడ్డి, వేల్పూర్, భీంగల్, ధర్పల్లి తదితర ప్రాంతాల్లో పరిషత్ కేంద్రాలు ఏర్పాటు చేసి తెలుగు భాష గొప్పతనాన్ని ప్రచారం చేశారు. తేనె పలుకు మాసపత్రికకు సంపాదకత్వం వహించారు. చౌటుపల్లి హనుమంత్ రెడ్డి ఉద్యమంలో పాల్గొని 1959 వరకు ఔరంగాబాద్ హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలో శిక్ష అనుభవించారు.

సమరం

రాచరిక పాలన నుంచి తెలంగాణకు స్వాతంత్ర్య కోసం జరిగిన ఉద్యమంలో వేల్పూర్ మండలం పడగల్‌కు చెందిన ఆరుగురు 1945లో పోరాటం చేసి జైలు పాలయ్యారు. హనుమాన్లు, నల్ల రాజారాం, నర్సింగ్, రాజన్న, గుర్రం సాయన్న పంతులు, రాజారం తదితరులు వివిధ జైల్లో శిక్ష అనుభవించారు. తర్వాత కాలంలో హనుమాన్లు ఇదే గ్రామానికి మొదటిసారిగా బస్సు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారు.


పోరాటంలో ప్రజలు, కమ్యూనిస్టులు(ఫైల్)


మోర్తాడుకు చెందిన సోషలిస్టు లింబగిరి (ఫైల్)

సాయుధ పోరాటంతో ఉమ్మడి జిల్లాల వాసులు

తెలంగాణ సాయుధ పోరాటంలో కామారెడ్డి జిల్లా నుంచి కన్నవారిని పుట్టిన ఊరిని వదిలి నిజాంను బెదిరించిన నరసింహారెడ్డి, సర్దార్ సింగ్, పనిహారం రంగాచారి, రాజారెడ్డి, కుప్పిరియాల్ గోపాల్ రెడ్డి ఎర్రపహాడ్‌కు చెందిన బొక్క గుండారెడ్డి వంటి ఎందరో ఉద్యమ వీరులు పోరాట స్ఫూర్తిని నింపి జిల్లాకే గర్వకారణంగా నిలిచారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన పనీహారం రంగాచారి పేరును మర్చిపోకుండా ఉండేందుకు జిల్లా కేంద్రంలోని ఒక కాలనీకి రంగాచారి కాలనీ అని కమ్యూనిస్టు నాయకులు నామకరణం చేశారు. రజాకర్ల ఆగడాలను ఎదిరించిన సాయిధ పోరాటంలో ఎందరో పాల్గొన్నారు.

జిల్లా నుంచి..

1857లో జరిగిన మొదటి స్వతంత్ర సంగ్రామంలో జిల్లాకు చెందిన కసాల రాజు, దిలీప్ సింగ్, మోర్తాడ్ జమిందార్ రాజా రుక్మారెడ్డి పాలకులను ఎదిరించారు. డివిజన్లోని మోర్తాడ్ రాజకుమార్ రెడ్డిని జైళ్ళలో సంకెళ్లతో బంధించి అనేక విధాలుగా హింసించారు. ఇక స్వతంత్ర సంగ్రామ యోధుడు నాన్న సాహెబ్ విశ్వకు ఆశ్రయమిచ్చాడు అంటూ కుస్తాపురం మహారాజు బాలకృష్ణను జిల్లాలోని గంజి ప్రాంతాల్లో ఏళ్లపాటు బంధించారు. చౌటుపల్లి హనుమంత్ రెడ్డి ఉద్యమంలో పాల్గొనడమే కాక ఉద్యమానికి ఆర్థిక సహాయం అందించారు. సాయుధ పోరాట సమరంలో జిల్లాలోని సిరికొండ మండలంలోని అన్న బేరి ప్రభాకర్‌రావు దళం సుమారు 500 ఎకరాల అటవీ భూములను పేదలకు పంపిణీ చేసిందని అప్పటి నాయకులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్టకు చెందిన పెద్ద చిన్నయ్య తన మిత్రులతో కలిసి 1946లో దారు గల్లీలో రజాకర్లపై దాడి చేశారు. ఖిల్లా జైలులో మూడుసార్లు శిక్ష అనుభవించారు. నాందేవ్‌వాడకు చెందిన కత్తి వీరుడు విట్టల్దాస్ ఉపాధ్యాయుడు వైవి సుబ్బారెడ్డి గోవా విముక్తి పోరాటంలో సైతం పాల్గొన్నారు.

డివిజన్లోని ఉద్యమ నేతలు

తెలంగాణ ఉద్యమంలో ఆర్మూర్ ప్రాంతానికి చెందిన అనేకమంది చురుగ్గా పాల్గొని జైలు జీవితం గడిపిన వారున్నారు. మోర్తాడుకు చెందిన సోషలిస్టు లింబగిరి, పి నరసింహారావు, బుచ్చారెడ్డి ,మంతిని రామ్ రెడ్డి, తమ్మిరాముడు, జానకిరామ్ గుప్తా, గోవింద పెట్ వీరభద్రయ్య, గంగుపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు. వేల్పూర్ మండలం నుంచి మీసాల హనుమాన్లు, రాజన్న రాజారాం పంతులు, గుర్రం సాయన్న, పడిగెల గ్రామస్తులు కాగా తుమ్మల రంగారెడ్డి, రాజిరెడ్డి అంక్సాపూర్ పచ్చల నడికుడ గ్రామాలకు చెందినవారు ఉన్నారు. బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన వికే రెడ్డి, జలాల్పూర్ గ్రామానికి చెందిన రాజేశ్వర్ రెడ్డి, నారాయణ రెడ్డి ముప్కల్ మండల కేంద్రానికి చెందిన పోలీస్ మల్లయ్య, అర్గుల రామదాసు, సాంబయ్య రేంజర్ల గ్రామానికి చెందిన కాట్రపల్లి రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని హసకొత్తూర్ గ్రామానికి చెందిన హనుమంత్ రెడ్డి చౌటుపల్లి గ్రామానికి చెందిన ఏలేటి శ్యాంసుందర్ రెడ్డి, నారాయణరెడ్డి హనుమంత రెడ్డి తదితరులు ఉద్యమంలో పాల్గొన్నారు. వీరితో పాటు భీంగల్ , జక్రంపల్లి మండలాలలోని నిజాం నిరంకుశ పాలనపై ఎదురోడ్డిన వీరులు ఉన్నారు.

నేటి యువత దేశ ప్రగతికి దోహదపడాలి

తులసి పట్వారి, సామాజిక సేవకుడు, ఆర్మూర్



ప్రపంచం గుర్తించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితం నిరంకుశత్వానికి చమర గీతం పాడిన తెలంగాణ విలీన దినం. నేడు యువత వ్యసనాల బారినపడి దారి తప్పుతున్నారు. తమ శక్తిని నిర్వీర్యం చేసుకుంటున్నారు. కొన్ని సామాజిక రుగ్మతలను పారదోలడానికి సంఘటితంగా కృషి చేయాలి.

ఎందరో కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారు

పల్లపు వెంకటేష్. సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి. ఆర్మూర్



నిజాం నిరంకుశ పాలనకు నరరూప రాక్షసులుగా చిలరేగిన రజాకారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఎందరో కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేసినారు. కమ్యూనిస్టుల నాయకత్వాన 1947 సెప్టెంబర్ 11న ప్రారంభమైన పోరాటం భూమికోసం, భుక్తి కోసం, మాతృభూమి విముక్తి కోసం జరిగింది. ఈ పోరాటం మూలంగానే హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనం అయింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలి. ముఖ్యమంత్రి సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం గా అన్ని ప్రభుత్వ కార్యాలయంలో జరుపుతామని ప్రకటించటం కొంతమేరకు స్వాగతించవలసిన విషయమే.

నిమజ్జనోత్సవానికి సహకరించాలి

- 8 ఫీట్ల కంటే ఎక్కువ ఎత్తున్న విగ్రహాలు ఉమ్మెడలో నిమజ్జనం
- అంతకు తక్కువ ఉన్నవి బాసరలో నిమజ్జనం చేయాలి
- మల్టీజోన్ -1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టత్మకంగా జరిగే గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ మండళ్ల నిర్వహకులు సహకరించాలని మల్టి జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 1వ టౌన్ పోలిస్ స్టేషన్‌లో నిజామాబాద్ పోలిస్ కమీషనర్ కల్మేశ్వర్‌తో కలిసి ఐజి చంద్రశేఖర్ రెడ్డి విలేఖరులతో మాట్లాడారు. ఈ నెల 17న జరిగే నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందితోపాటు ప్రజలు సహకరించాలని కోరారు.8 ఫీట్ల కంటే ఎత్తు ఉన్న విగ్రహాలను నందిపేట్ మండలం ఉమ్మెడ వద్ద నిమజ్జనం చేయాలని, అంతకంటే తక్కువ ఉన్న వాటిని బాసరకు తరలించాలని సూచించారు. బాసరకు వెళ్లే దారిలో జాన్కంపేట్ వద్ద రైల్వే లైన్ వద్ద విద్యుత్ తీగలు తగులుతాయని, అందుకే ఎక్కువ ఎత్తు ఉన్న వాటిని ఉమ్మెడలో నిమజ్జనం చేయాలని సూచించారు. ఈ సంవత్సరం సున్నితమైన ప్రాంతాలలో శోభయాత్ర సాగే సమయంలో అధనపు సిబ్బందితో పాటు సిసి కెమోరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా సిబ్బందితో పాటు 2000 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 'గణేష్ నిమజ్జనంలో డిజేలకు అనుమతి లేదు. మైక్ సెట్ లకు మాత్రమే అనుమతి ఉంది. ఉరేగింపు సందర్భంగా నేరాలు జరుగకుండా చైన్ స్నాచింగ్ లతో పాటు ఈవ్ టీజింగ్, జేబు దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐజి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సమావేశంలో అడిషనల్ డిసిపి కోటేశ్వర్ రావు, ఎసిపి రాజా వెంకట రెడ్డి, ట్రాఫిక్ ఎసిపి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

17న వాహనాల దారి మళ్లింపు

నిజామాబాద్ నగరంలో 17న వాహనాల దారి మళ్లింపు ఉంటుందని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. ఈ మేరకు రథ శోభాయాత్ర ఉత్సవం రూట్ మ్యాప్ దుబ్బా చౌరస్తా నుంచి రైల్వేగేట్, గంజి, గాంధీ చౌక్, నెహ్రూ పార్క్, బోధన్ బస్‌స్టాండ్, 2-టౌన్ బ్యాక్‌సైడ్ బర్కత్పురా, గురుద్వారా నుంచి లక్ష్మీ మెడికల్ బడా బజార్ చౌరస్తా, గోల్ హనుమాన్ చౌరస్తా, పూలాంగ్ చౌరస్తా మీదుగా వినాయకుల భావి వరకు ఇట్టి రథయాత్ర కొనసాగుతుందని తెలిపారు. కావున నిజామాబాద్ నగర ప్రజలు తెలిపిన మార్గంలో వేరే వాహనాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్‌కు వచ్చే ఆర్టీసీ వాహనాలు మాధవ నగర్, కంఠేశ్వర్ బైపాస్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు రాగలరని ప్రయాణికులకు తెలిపారు. బోధన్ వెళ్లే ఆర్టీసీ వాహనాలు రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ చౌరస్తా, బైపాస్, న్యూ కలెక్టరేట్, అర్సపల్లి రైల్వే మీదుగా బోధన్ వైపు వెళ్లాలని పేర్కొన్నారు. బాన్సువాడ వెళ్లే వాహనాలు రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ చౌరస్తా, కోర్టు సర్కిల్, పూలాంగ్ చౌరస్తా, ఆర్ఆర్ చౌరస్తా, వర్ని చౌరస్తా మీదుగా బాన్సువాడ వైపు వెళ్లాలని సూచించారు. హైదరాబాద్ వైపు నుంచి బోధన్ వెళ్లే భారీ వాహనాలు మాధవ నగర్, బైపాస్, న్యూ కలెక్టరేట్, అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా బోధన్ వైపు వెళ్లాలని తెలియజేశారు. కావున నగర ప్రజలు ఇట్టి విషయాన్ని గమనిస్తూ ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరించగలరని కోరారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులదే

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు



నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టుదేనని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఎస్.వీ.డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కమ్యూనిస్ట్ యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశలో నుండి కమ్యూనిస్టు ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారని అన్నారు. ఆయన తన జీవితాంతం భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశారని అన్నారు. పుట్టింది బ్రాహ్మణ కుటుంబమైన ఉన్నత వర్గానికి చెందినప్పటికీ నిరంతరం ఈ దేశంలోని ప్రజల కోసం కార్మిక వర్గం కోసం సమ సమాజం కోసం ఆలోచించేవారని అన్నారు. దానికోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటం అన్నారు. ఆనాడు దేశ్ ముఖ్ లు, దొరల, భూస్వాముల, పటేల్ పట్వారిల పెత్తనానికి దోపిడీలకు వ్యతిరేకంగా ఈ పోరాటం జరిగిందని అన్నారు. అయితే నేటి అధికారంలోని బిజెపి ప్రభుత్వం ముస్లిం రాజుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా వక్రీకరించడం సరికాదని అన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది తెలంగాణ ప్రజలు అమరులయ్యారని తెలిపారు. వీరు త్యాగాల ఫలితం వృధా కాలేదని 10 లక్షల ఎకరాల భూమి పంచబడిందని అన్నారు. కావున పోరాడితే పోయేవి బానిస సంకెళ్ళ అని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు తప్ప ఎవరు కారని అన్నారు. తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తి తో ప్రజలు తమ హక్కులకై ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాడాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్ గౌడ్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గంగాధర్, జంగం గంగాధర్, నన్నే సాబ్, నాగేశ్వర్, పిఎస్ఎమ్ జిల్లా కార్యదర్శి సిర్పలింగం, సిపిఎం నాయకులు దాసు గోపి, పత్రి ఎల్లయ్య, షేక్ నజీర్, పోశెట్టి, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసాద్, సత్యనారాయణ, సాయిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే కార్యకర్తలకు న్యాయం

- టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేశ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కార్యకర్తకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ లోనే సాధ్యమని, ఎంతో గొప్ప పార్టీ అయిన కాంగ్రెస్ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ భవన్‌లో ఆదివారం ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి పీసీసీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్ రెడ్డి, సీనియర్ నాయకుడు వీహెచ్ తదితరులు ప్రసంగించారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గాంధీ భవన్ దేవాలయంతో సమానమని, తానెప్పటికీ కార్యకర్తనేనని, అందరిలో ఒకడిగా ఉంటూ పార్టీకి, ప్రభుత్వానికి వారధిలా పని చేస్తానని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో పవర్ సెంటర్ అంటూ ఏమీ ఉండదని, ఉన్నది ఒక్క రాహుల్ గాంధీ వద్దేనని అన్నారు. కాంగ్రెస్‌లో నాయకత్వ లేమి లేదని, అందరూ సమర్థులేనని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ భవన నిర్మిస్తామని, ఆయా ప్రాంతాల్లో మార్కెట్ ధరకు స్థలం ఇప్పించేలా సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఎంతో మంది పేదలు, నాయకులు, కార్యకర్తలు తమ పనులనిమిత్తం గాంధీభవన్ కు వస్తుంటారని, మంత్రులు విధిగా వారం రెండు రోజులు, సీఎం నెలలో రెండుసార్లు గాంధీ భవన్ కు రావాలని ఆయన కోరారు.


టీపీసీసీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

వినాయకుడి చుట్టూ 'రాజకీయాలు'

- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండపాలకు ఆశవాహుల తాకిడి
- ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తూ ముందస్తు ప్రచారం

నవతెలంగాణ-గాంధారి

వినాయకుడి చుట్టూ రాజకీయాలు ప్రదక్షిణలు చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో యువతను, ఆయా వార్డుల వాసులను మచ్చిక చేసుకునేందుకు పలువురు ఆశావహులు గణపతి ఉత్సవాలను వినియోగించుకుంటున్నారు. ప్రారంభంలో వినాయకుడి విగ్రహాలుకొనివ్వడం మొదలు, మండపం వేయించడం, అన్నదానాలకు దాతలుగా నిలవడంతో పాటు నిమజ్జనానికి డీజే సౌకర్యాలు సైతం కల్పించేందుకు ముందుకు వస్తుండటం గమనార్హం.

త్వరలో స్థానిక సంస్థ ఎన్నికలు ఉండడంతో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు అడగకముందే గణేష్ మండపాల నిర్వాహకులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది వరకే విగ్రహాలు కొనివ్వడంతో పాటు ప్రస్తుతం అన్నదానం ఖర్చులు చెల్లిస్తున్నారు. దీంతో పాటు గణేష్ నిమజ్జనం రోజు డీజే ఖర్చులు, బ్యాండ్ ఖర్చులు గణనాధుని నిమజ్జనం తరలించడానికి ట్రాక్టర్ ఖర్చులు ఇతర నిర్వహణ ఖర్చులు ఈసారి నాయకులు పోటీపడి గణేష్ మండపాల నిర్వహణ ఖర్చులు భరిస్తున్నారు. యువతను మాకు ఎన్నికలలో సహకరించాలని ప్రత్యక్షంగా ప్రచారం చేయకుండా పరోక్షంగా యువతను ప్రసన్నం చేసుకోవడం కోసం వివిధ రాజకీయ పార్టీల నాయకులు పోటీ పడుతున్నారు. అన్ని పార్టీల రాజకీయ నాయకులు మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో నాయకులు సర్పంచ్ ఎంపీటీసీ వార్డ్ మెంబర్ జెడ్పిటిసికి పోటీ చేసే ఆలోచనలు ఉన్న అభ్యర్థులు గణేష్ మండపాల ఏర్పాటు చేసిన నిర్వాహకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అలాగే ఒకసారి ప్రచారం కూడా అయిపోతుందని నాయకులు భావిస్తున్నారు. దీంతో పాటు తాము పోటీలో ఉంటున్నట్టు ఆయా పార్టీల అధిష్టానాలకు సంకేతాలు సైతం పంపుతున్నట్టవుతుంది. తామే పార్టీ అభ్యర్థులమని, పార్టీలో ఉన్న నాయకులకు కూడా సర్పంచ్ పోరులో తాము ఉన్నట్టు పరోక్షంగా సూచిస్తున్నారు.



నిమజ్జనానికి తరలేందుకు సిద్ధమవుతున్న గణనాథులు

మొబైల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామానికి చెందిన ఇనగందుల కీర్తన గత సంవత్సరం ఆగస్టు 18 న కిసాన్ నగర్ నుంచి బాల్కొండ కు బైక్ పైన వెళ్తుండగా తన మొబైల్ ఫోన్ కింద పడిపోయింది. ఈ విషయమై కీర్తన బాల్కొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మొబైల్ ఫోను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఆదివారం బాల్కొండ ఎస్ఐ బి. నరేష్ బాధితురాలు కీర్తనకు మొబైల్ ఫోన్ అప్పగించారు.


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ నరేశ్

టిపిసీసీ అధ్యక్షుని ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు



నవతెలంగాణ-మాక్లూర్

టీపీసీసీ అధ్యక్షుని ప్రమాణ స్వీకారానికి మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదారాబాద్‌లోని గాంధీ భవనానికి ఆదివారం వెళ్ళారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవి ప్రకాష్ మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను టీపీసీసీ అధ్యక్షులుగా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వెళ్లిన వారిలో ఈ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్రావు, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు పీర్ సింగ్ నాయక్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ జైల్ సింగ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు, మండల నాయకులు ఉన్నారు.

నేటి రైతు నిరసన కార్యక్రమం వాయిదా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం నిర్వహించ తలపెట్టిన రైతు నిరసన కార్యక్రమాన్ని ఈనెల 19వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు రైతు జేఏసీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ అందించాలని, రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని, వరికి రూ.500 బోనస్ అమలుకై ఈ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి రైతు జేఏసీ ఆధ్వర్యంలో ఈ రైతు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టిన విషయం తెలిసిందే. కాగా పసుపు బోర్డు ఉద్యమకారుడు ముత్యాల మనోహర్ రెడ్డి మృతి చెందడం, సోమవారం రోజున మిలాద్ ఉన్ నబి సందర్భంగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడం, గణపతి నిమజ్జన కార్యక్రమాలు ఉండడం వల్ల తహశీల్దార్లు అందుబాటులో ఉండని కారణంగా తహసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నా, 19వ తేది గురువారానికి వాయిదా వేసినట్లు జేఏసీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఈ విషయాన్ని గమనించి 19న జరిగే రైతు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు జేఏసీ నాయకులు కోరారు.

లక్ష్యంతో ముందుకెళ్తేనే ఉత్తమ ఇంజినీర్

- మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్
- మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళ్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఒక లక్ష్యంతో ముందుకెళ్తే.. మీరు ఒక ఉత్తమ ఇంజనీర్ అవుతారని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శాఖ కమీషనర్ మంద మకరంద్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే సందర్భంగా నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో, నిజామబాద్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, కళాశాల ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇంజనీర్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మకరందం, గౌరవ అతిథిగా ఎన్ డి సి సి బ్యాంక్ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి, సభ అధ్యక్షు కళాశాల ప్రిన్సిపల్ బి నరేష్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు పి.బాల నరసింహులు, తదితరులు పూలమాలలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మంద మకరంద మాట్లాడుతూ గొప్ప ఇంజనీర్ ఉండాల్సిన 3 లక్షణాల గురించి విద్యార్థులకు వివరించారు. దేశ సమగ్రత, పనిలో అంకితభావంతో మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతరత్న కాగలిగారని తెలిపారు. డిప్లమా ఇంజనీర్ తర్వాతేనే ఆయన ప్రావీణ్యతను సంపాదించి దేశ ప్రజల కోసం పనిచేసినందుకే వారికి భారతరత్న బిరుదు ఇచ్చారని తెలిపారు. భారతరత్న కావాలనే ఒక లక్ష్యంతో ముందుకెళ్తే.. మీరు ఒక ఉత్తమ ఇంజనీర్ అవుతారని అన్నారు. సైన్స్ అండ్ ఇంజనీరింగ్ గురించి క్లుప్తంగా ప్రస్తావించారు ఇంజనీర్స్ మ్యాథమెటికల్ బేసిక్స్ ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వారి ప్రసంగం విద్యార్థుల విజ్ఞానాన్ని పెంచేదిశగా కొనసాగించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కుంట రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య ఒక సామాన్య కుటుంబం నుంచి భారతరత్నగా ఎదిగారని, ఆయన్ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కూడా గొప్ప ఇంజనీర్ కావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ బి. నరేష్ మాట్లాడుతూ విశ్వేశ్వర సామాన్య కుటుంబం నుంచి వచ్చి అప్పటి మైసూరు ప్రభుత్వంలో దివానుగా పనిచేసే స్థాయికి ఎదిగారన్నారు. అదే విధంగా గొప్ప ఇంజనీర్‌గా కావాలని విద్యార్థులకు సూచించారు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు పి బాల నరసింహులు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల సంఘం పాలిటెక్నిక్ కళాశాలకు చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. రాష్ట్రంలోనే ఈ కళాశాలను మొదటి స్థానంలో నిలపడానికి పూర్వ విద్యార్థుల సంఘం ప్రయత్నం చేస్తుందని చెప్పారు. పూర్వ విద్యార్థుల అందరం కలిసి త్వరలో 65 సంవత్సరాల వేడుక నిర్వహిస్తామని అన్నారు.



సర్టిఫికెట్స్, మెమోంటోలను అందుకున్న విద్యార్థులు

కాలేజీ టాపర్స్‌కు గోల్డ మెడల్, సర్టిఫికెట్స్..

పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కాలేజీ టాపర్స్‌కు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్, మెమోంటోస్‌తో సన్మానించారు. బిగాల కృష్ణమూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో టాపర్ స్టూడెంట్స్‌కి ప్రతి ఒక్కరికి పదివేల రూపాయలు, సర్టిఫికెట్‌తో సత్కరించారు. సివిల్ ఇంజనీరింగ్‌లో విశ్వనాథ్ రసిక, లకావత్ ప్రవీణ్, కంప్యూటర్ సైన్స్‌లో గోసికొండ రామరాజు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ లో కర్కా రచన, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ సిలివేరి శ్రీ నిత్య, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో ఉమ్మెడ శ్రీజ, ఇన్సిడెంట్ సిస్టమ్స్ ఇంజనీరింగ్‌లో నమ్మసాని అరవింద్, మెకానికల్ ఇంజనీరింగ్‌లో కోమటి మధుకర్ టాపర్స్‌కు సత్కరించారు. విశ్రాంత ఇంజనీర్స్‌కు సన్మాన గ్రహీతలు ఘనంగా సత్కరించారు.

మెండోరా : శ్రీరాంసాగర్ జలవిద్యుత్ కేంద్రంలో భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ని పురస్కరించుకొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీర్ల మేథోసంపత్తికి దర్పణంగా రూపుదిద్దుకున్న నిర్మాణాలు దేశ ప్రగతికి ప్రతీకలుగా ఎన్నో జాతికి అందించి దేశంలో ఎన్నో ప్రాంతాలు సుభిక్షంగా తులతూగడానికి కారణమైన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో జలవిద్యుత్ కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ : నీటి పారుదల రంగంలో నిష్ణాతుడు, తన ప్రతిభానైపుణ్యాలు, ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో దేశాన్ని అభివృద్ధివైపు నడిపించిన నవభారత నిర్మాత, భారతీయ ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాల సృష్టికర్త, రాజనీతిజ్ఞుడు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి, ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. యువ ఇంజనీర్లు నిత్యం సవాళ్ళను పరిష్కరిస్తూ, వినూత్న ఆలోచనలు, నూతన ఆవిష్కరణలతో తాగునీటి, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో విశ్వేశ్వరయ్య ఆశయాలు, కలలు సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్స్, గురుకుల పాఠశాలలు సందర్శన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పిఎఫ్ ఆఫీస్ ఏరియా రోటరీ నగర్ నందు గల సోషల్ వెల్ఫేర్ హాస్టల్, ఎస్సీ హాస్టల్, గురుకుల పాఠశాల అనాధ పిల్లల హాస్టల్ ను ఆదివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్, ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య, కెవిపిఎస్ సభ్యులు సతీష్ సాంపెల్లి ఉన్నారు. మొదట అనాధ పిల్లల హాస్టల్లో వసతులు ఎలా ఉన్నాయని పిల్లలను కనుక్కొని వారి బాగోగులు తెలుసుకున్నారు. మెనూ ప్రకారము పౌష్టికారాన్ని ప్రభుత్వం అందించడం లేదని, మరుగుదొడ్ల డోరు కూడా లేని పరిస్థితి ఉందని, పిల్లలు కింద పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ హాస్టల్ సందర్శించగా 130 మంది విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, వారికి ప్రైవేటు ఆటోను పాఠశాల వరకు తల్లిదండ్రులు నెలకు 300 నెలకు చొప్పున భరిస్తున్నారని అన్నారు. ఇది ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సరైన పౌష్టికాహారం లేకపోవడం, మరుగుదొడ్లు కూడా శుభ్రంగా లేకపోవడం వల్ల అనారోగ్యం వచ్చే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే కొత్త డోర్లు ఏర్పాటుచేయాలని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చిన్నారులకు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. లేకుంటే విద్యార్థులకు సౌకర్యాలు కల్పించే వరకు ఆందోళనలు తప్పవన్నారు.

రక్తదానం చేద్దాం..సేవాబావాన్ని చాటుదాం

- తిర్మన్‌పల్లి గ్రామ యువత పిలుపు


రక్తదానంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రక్తదానం చేద్దాం సేవాభావాన్ని తమ వంతు చాటి చెబుదాం.. ఆపదలో ఉన్న వారికి రక్షించిన వారవుతామని, ఎక్కడ రక్త దాన శిబిరం ఉన్నా యువత తమవంతుగా రక్తదానంకు ముందుకు రావాలని తిర్మన్ పల్లి గ్రామ యువత పిలుపునిచ్చారు. ఆదివారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెడ్ క్రాస్ సోసైటి, తిర్మన్ పల్లి గ్రామ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామ యువకులు ముందస్తుగా తమ పేర్లను ఒకరి వద్ద నమోదు చేసుకొని రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఒకరి రక్తదానం - మరొకరికి ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సోసైటి సిబ్బంది సుమలత, పోతన్న, జి గంగాధర్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

విజయ్ హైస్కూల్లో మదర్స్‌మీట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ఆర్మూర్

నిజామాబాద్ ముబారక్ నగర్ విజయ్ హైస్కూల్లో ఆదివారం మదర్స్‌మీట్ నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలపై విద్యార్థుల తల్లులకూ, ఉపాధ్యాయులకూ మధ్య అవగాహన కల్పించేందుకు విద్యార్థుల పురోగతికై చర్చించేందుకు ప్రతియేటా మదర్స్మీట్ నిర్వహిస్తామని డా. అమృతలత తెలిపారు. విద్యార్థుల మాతృమూర్తుల తరపున డి. అనసూయ అధ్యక్షత వహించగా, పాఠశాల కార్యదర్శి డా. అమృతలత, ఐడియల్ ఎజ్యుకేషన్ సొసైటీ మెంబర్స్ ఎ. తారాచౌదరి, కె. విజయలక్ష్మి, జి. సునీత, జి. ఇందిరాదేవి, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ విజేత, , ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల మదర్స్ పాల్గొన్నారు. విద్యార్థుల వివిధ సమస్యలు, వాటి పరిష్కారంపై టీచర్స్ మదర్స్ చర్చించారు. అనంతరం విద్యార్థుల మదర్స్ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటల పోటీల్లో పాల్గొన్నారు.

ఆర్మూర్ : మున్సిపల్ పరిధిలోని విజయ్ హైస్కూల్ మామిడిపల్లిలో పాఠశాల విద్యార్థుల మాతృమూర్తుల సమావేశాన్ని ప్రధానోపాధ్యాయురాలు టి. కవితాదివాకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, విద్యార్థుల మాతృమూర్తులకు మధ్య అవగాహన పెరగడానికి పిల్లల చదువు - క్రమశిక్షణ, వారి అభివృద్ధి - వికాసం పరీక్ష విధానంపై సందేశాలను తీర్చి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మాతృమూర్తుల సూచనల పట్ల స్పందించి, పరిష్కరించారు. తదనంతరం త్రోబాల్, బాంబ్ ఇన్ ద సిటీ, సోలో డాన్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన మాతృమూర్తులకు పాఠశాల వార్షికోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బీఐఎస్‌పై వినియోగదారులకు అవగాహన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) కార్యక్రమాలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షులు డాక్టర్ పల్లె పాడు దామోదర్ అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లోని ఇందూర్ కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం వినియోగదారులకు కల్పించిన హక్కులను కాపాడడానికి వినియోగదారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారతీయ ప్రమాణాల సంస్థ ముఖ్యపాత్ర వహిస్తుందని అన్నారు. ముఖ్యంగా బీఐఎస్ రూపొందించిన ఆప్‌ను ప్రతి వినియోగదారుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాల, కళాశాల స్థాయిలో బీఐఎస్ క్లబ్ ఏర్పాటు చేసి వినియోగదారుల చట్టం గురించి భారతీయ ప్రమాణాల సంస్థ గురించి విద్యార్థి దశ నుండి తెలుసుకోవడానికి అవకాశం కల్పించాలని అన్నారు. వినియోగదారులు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్న వివిధ రకాల వస్తువులు, సరుకుల నాణ్యత ధృవీకరణకు 380 ఉత్పత్తులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేసిందని డా. పల్లెపాడు దామోదర్ తెలిపారు.

380 రకాల ఉత్పత్తుల్లో చిన్న పిల్లలకు ముఖ్య ఆహారమైన పాలపొడి, కొన్ని రకాల వంటనూనెలు, వనస్పతి, తాగు నీరు, బంగారు ఆభరణాలు, సిమెంట్ లాంటివి ఉన్నాయని ఆయన అన్నారు. కాబట్టి వినియోగదారులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సేవల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అపుడే నకిలీ, నాసిరకం మోసాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. మహిళలు బంగారు ఆభరణాల కొనుగోలులో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్ మార్కింగ్ ముద్ర ఉన్న నగలనే కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రాదాన్యత తెలిపే పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు వియన్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శిలు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, గడప రవికుమార్, బానోత్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పలువురు

ఆకుపచ్చ కండువా కప్పి నివాళులర్పించిన రైతు జేఏసీ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మోర్తాడ్ మండల పరిధిలోని పాలెం గ్రామ మాజీ సర్పంచ్.ముత్యాల మనోహర్ రెడ్డి నిస్వార్ధానికి మారుపేరు అని, మూడు దశాబ్దాలకు పైగా ఆర్మూర్, జగిత్యాల ప్రాంతంలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి జరిగిన ఉద్యమంలో తాను ముందు వరుసలో నిలబడ్డారని రైతు జేఏసీ నాయకులు అన్నారు.

మనోహర్ రెడ్డి ఈనెల 14న మృతిచెందిన వార్త తెలుసుకున్న వెంటనే డివిజన్ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ప్రభాకర్ , దేగాం యాద గౌడ్., మంథని గంగారం(పిట్ల), సుర్బిర్యాలీ లింగారెడ్డి. బి దేవారం ఆదివారం కొంపల్లి లోగల మనోహర్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి రైతుకు చిహ్నమైన ఆకుపచ్చ కండువను కప్పి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మనోహర్ రెడ్డి రాజకీయాలకు అతీతంగా వ్యవసాయ రంగ అభివృద్ధి కొరకు నిరంతరం ఆలోచించేవాడని అన్నారు.

సీడ్ వ్యాపారులు సిండికేట్ అవతారమెత్తి ఎర్రజొన్నల ధరను కృత్రిమంగా తగ్గించి వేసిన సందర్భంగా సిండికేట్ వ్యాపారుల గుట్టు రట్టు చేసే విధంగా జరిగిన ఆమరణ నిరాహార దీక్షలో పట్టుదలగా కొనసాగించారని తెలిపారు. . పసుపు బోర్డు సాధన కొరకు జరిగిన ఉద్యమంలోనూ తన వంతు ప్రత్యేక పాత్రను పోషిస్తూ పసుపుబోర్డు సాధించే వరకు కాళ్లకు చెప్పులు ధరించనని దీక్షపూని 12 సంవత్సరాలు ఆచరించారు. ఆ వెలుగులోనే తిరుపతి వరకు పాదయాత్ర మొక్కవోనినిధైర్యంతో సాగించారు.. రైతు ఉద్యమంపై నాటి ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించి బూటకపు కేసులు బనాయించిన సందర్భంగా కూడా ధైర్యంగా నిలబడ్డారని అన్నారు. పసుపు బోర్డు ఆర్మూర్ వచ్చిందని చెప్పిన మాటలు విని కాళ్లకు చెప్పులు వేసుకొని మోసపోయిన అని రైతు నాయకుల ముందు చెప్పి బాధపడ్డ రోజులు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. పసుపు బోర్డును, పసుపు కు కనీస మద్దతు ధర క్వింటాల్కు 15 వేల రూపాయలు చట్టబద్ధత కల్పించాలని ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మనోహర్ రెడ్డి ఆలోచన నెరవేరే వరకు ఐక్య కార్యాచరణ కమిటీ ఉద్యమిస్తుందని ఈ సందర్భంగా ప్రతినబునారు.. రైతు నాయకుని స్మరిస్తూ కొంపల్లిలో విస్తృతంగా బ్యానర్లను కట్టినట్టు తెలిపారు.

మనోహర్ రెడ్డి మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

పసుపు బోర్డు కోసం పుష్కర కాలానికి పైగా చెప్పులు లేకుండా నడిచిన 'పసుపు మనోహర్ రెడ్డి' మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది అని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక నాయకులు కోటపాటి నరసింహ నాయుడు, రైతు జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

- స్టేట్ రిసోర్స్ పర్సన్


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థిని విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ చక్రవర్తుల శ్రీనివాస్ అన్నారు. మండల ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని కోటర్మూర్ జి ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పెర్సన్స్ , టెక్స్ట్ బుక్ రైటర్ చక్రవర్తుల శ్రీనివాస్ శశికలాధర్ , గౌస్ పాషా తదితరులు పాల్గొని విద్యార్థులకు సబ్జెక్టు లోని మెలకువలు, మానసికంగా ధృడంగా ఉండాలంటే మన జీవన విధానం ఏ విధంగా ఉండాలో తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్య ప్రవీణ్ పవార్, ప్రోగ్రాం కన్వీనర్లు శ్రీ భాశిత సుందర్, కాంతి గంగారెడ్డి, మానస గణేష్, నలందా ప్రసాద్, కోశాధికారి స్కాలర్స్ వేణు, జెంటిల్ కిడ్స్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో బోధించుటకు అతిథి అధ్యాపక పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వై. వేణు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజనీతి శాస్త్రం (01), చరిత్ర (01) లో పోస్టులు కలవని, రాజనీతి శాస్త్రం, చరిత్ర బోధించుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి ఈనెల 18న మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్లో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. అభ్యర్థులు పీజీలో 55శాతం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండి నెట్, సెట్, పిహెచ్‌డి పట్టా ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు 18న ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమో నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

మట్టి గణపతిని పూజించండి

- లిటిల్ ఆర్ట్స్ ఎకో ఫ్రెండ్లీ గణేష్ మండలి


కరపత్రాలు అందజేసిన పలువురు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో గల లిటిల్ ఆర్ట్స్ ఎకో ఫ్రెండ్లీ గణేష్ మండలి సభ్యులు మట్టి గణపతిని పూజించాలని గణేష కమిటీ సభ్యులకు కరపత్రాలు అందజేస్తూ కోరుతున్నారు. వారు చిన్నపిల్లల అయినప్పటికీ పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి సంవత్సరం మట్టి వినాయకుని ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. అలాగే గ్రామంలో ఉండే ప్రతి గణేష్ కమిటీ సభ్యుల దగ్గరికి వెళ్లి వచ్చే సంవత్సరం అయినా మట్టి వినాయకుడునీ ప్రతిష్ఠించాలని వారికి కరపత్రాలు అందజేస్తున్నారు. వారిని చూసి గ్రామ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై యాదగిరి వారు ప్రతిష్ఠించిన మట్టిగణపతిని సందర్శించి పిల్లల్ని అభినందించారు. వారు ఎస్సై కి భగవద్గీత పుస్తకాన్ని బహుమానంగా ఇచ్చారు.

విజయ్ హైస్కూల్లో స్కూల్ లెవల్ వైజ్ఞానిక ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ ముబారక్ నగర్ విజయ్ హైస్కూల్లో ఆదివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి డాక్టర్. అమృతలత, ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్స్- ఎ. తారాచౌదరి, కె. విజయలక్ష్మి, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి. వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ విజేత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముద్దుకృష్ణ, యం. లావణ్య-లెక్చరర్, యం. భాస్కర్-లెక్చరర్, రిటైర్డ్ డైట్ లెక్చరర్ ఏ .తారాచౌదరి, రిటైర్డ్ హెచ్ ఎం జి.ఇందిరాదేవి, పలువురు ఉపాధ్యాయులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సహజ వ్యవసాయం, ఆరోగ్యం, పరిశుభ్రత, వనరులు, వ్యర్థాల నిర్వహణ, విపత్తు నిర్వహణ రవాణా, కమ్యూనికేషన్, గణిత నమూనా, గణన ఆలోచన, యోగా, ఆటలు, క్రీడలు, తెలుగు భాషా సాహిత్యం, హిందీ భాషా సాహిత్యం, ఇంగ్లీష్ భాషా సాహిత్యం మొదలైన ఎనిమిది విభాగాల్లో ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ప్రాథమిక పాఠశాల నుండి 79, ఉన్నత పాఠశాల నుండి 115 ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఉత్తమమైన ఎగ్జిబిట్లను జిల్లాస్థాయి సైన్స్ఫెయిర్ కి ఎంపికచేస్తారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను, న్యాయనిర్ణేతలను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ అమృతలత అభినందించారు.



వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న అమృతలత

శోభయాత్రకు సిద్ధమవుతున్న గణనాథులు

నవతెలంగాణ-గాంధారి

గత తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న గణనాథులు శోభాయాత్రలకు సిద్ధమవుతున్నాయి. మండల కేంద్రంలో నెలకొల్పిన గణనాథులు భక్తులు తొమ్మిది రోజులుగా ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచి ఆదివారం రాత్రి నుండి శోభాయాత్ర ప్రారంభమవుతుంది. సోమవారం సాయంత్రం నిమజ్జనం పూర్తవుతుంది.




శోభయాత్రకు సిద్ధమైన వినాయకులు

మండలంలో మాజీ ఎంపీ పూజలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీ శెత్కరి గణేష్ మండపాన్ని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మండపాన్ని సందర్శించిన మాజీ ఎంపీకి శ్రీ శెత్కరి గణేష్ మండల్ అధ్యక్షులు గంగాధర్ బండి వార్ శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మద్నూర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు తెప్ప తుకారం డోంగ్లి సింగిల్ విండో చైర్మన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రామ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీని సన్మానించిన కమిటీ సభ్యులు

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- కామారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

నవతెలంగాణ-కామారెడ్డి

గణేష్ నవరాత్రి నిమగ్న ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం మున్సిపల్ చైర్ ర్సన్ ట్రాక్టర్ నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో కాకతీయ నగర్ కమ్యూనిటీ హాల్ గణేష్ వద్ద పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గణేష్ నవరాత్రి నిమ్మజ్జన ఊరేగింపును తన చేతుల మీదుగా ప్రారంభించడం పూర్వజన్మ సుకృతం అన్నారు. ముంబై తర్వాత తెలంగాణలో అత్యంత వైభవంగా గణేష్ నవరాత్రి వేడుకలు కామారెడ్డి మున్సిపాలిటీలో జరుగుతాయని అన్నారు. పండగలను అంత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కామారెడ్డిలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి వేడుకలు కోసం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని, చెరువుల వద్ద జరిగే నిమజ్జనం కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. నిమజ్జనం సమయంలో క్రెయిన్ సౌకర్యంతో పాటు తాగునిటీ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. పోలీస్, రెవిన్యూ, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య అగ్నిమాపక శాఖలతో కలిసి సమన్వయం చేసి నిమజ్జన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఊరేగింపు ఉత్సవాలను కలిసి కట్టుగా శాంతియూత వాతావరణంలో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ నగర్ కమ్యూనిటీ హాల్ గణేష్ మండలి నిర్వహకులు శ్రీనివాస్ రెడ్డి, భూపతి, రాములు, లింగం యాదవ్, గణేష్, నరేందర్ రెడ్డి, బ్రమ్మం, శ్రీనివాస్ చారి, వేణు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన శోభాయాత్రకు ట్రాఫిక్ ఆంక్షలు..

పట్టణంలో జరిగే వినాయక నవరాత్రి నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పట్టణ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 16న ఉదయం 11 గంటల నుంచి 18న ఉదయం 9 గంటల వరకు పట్టణంలోని స్టేషన్‌రోడ్, సిరిసిల్లా రోడ్, సుభాష్‌రోడ్, పెద్ద బజార్, పాంచ్ రాస్తా, వీక్లీ మార్కెట్ రోడ్డు, జేపిఎన్‌రోడ్, తిలక్ రోడ్‌లలో ట్రాఫిక్ ఆంక్షలు విధించమని పేర్కొన్నారు. దయచేసి ప్రయాణికులు, కామారెడ్డి పట్టణంలోకి వచ్చేవారు. తాము సూచించిన విధంగా ప్రయాణం చేసి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు.

1. నిజాంసాగర్ చౌరస్తా నుంచి స్టేషన్ రోడ్డు వైపుకు భారీ వాహనాలు అనుమతించబడవని, చిన్న వాహనాలు అవసరాన్ని బట్టి మాత్రమే, వారి నివాసాలకు వెళ్లే విధంగా అనుమతించబడును.

2. సిరిసిల్ల రోడ్డు నందు మాచారెడ్డి వైపు నుంచి కామారెడ్డికి వచ్చే వాహనాలను, సిరిసిల్ల బ్రిడ్జి వద్ద ఎన్‌హెచ్ 44 వైపుకు మళ్ళించమన్నారు.

3. రామారెడ్డి, గర్గుల్ నుంచి వచ్చే వాహనాలను, గుమాస్తా కాలనీ వద్ద జిల్లా పోలీస్ కార్యాలయం వైపు మళ్ళించమని,

4. అశోక్ నగర్ రైల్వే గేటు వద్ద నుంచి పట్టణం లోపలికి వచ్చే వాహనాలను, కొత్త బస్టాండ్ వైపుకు మళ్ళించినట్లు ఆయన పేర్కొన్నారు.

5. ఆర్టీసీ బస్సులను కొత్త బస్టాండ్ వద్ద నుంచి మాత్రమే అనుమతించబడును. ప్రయాణికులు వారి యొక్క ప్రయాణాలను కొత్త బస్టాండ్ వద్ద నుంచి మాత్రమే కొనసాగించలని ఈ సందర్భంగా ప్రకటించారు.

ఇందుకు దయచేసి ప్రతి ఒక్కరూ సహకరించగలరని విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.



శోభయాత్రను ట్రాక్టర్ నడిపి ప్రరాంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

గాంధారి మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

గాంధారి : మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనంకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. గణేష్ రథయాత్ర రూట్ మ్యాప్ గణేష్ నిమజ్జనం చేసే పెద్దవాగు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిమజ్జన యాత్ర ప్రశాంతంగా జరిగేటట్టు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలి



మాట్లాడుతున్న బుర్ర నారాగౌడ్

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ కార్యకర్తలకు సూచించారు. లింగంపేట్ మండలం ఎక్కపల్లి లో ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపిత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కొరకు కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట ప్రధాన కార్యదర్శి మైనార్టీ రఫీయొద్దీన్, మండల ఉప అధ్యక్షులు హరి సత్యం లక్షణ్ గౌడ్, మండల మాజీ అధ్యక్షులు ఎల్లమయ్య మాజీ ఎంపీపీ మోహిద్ రాష్ట్ర మాజీ ఉప అధ్యక్షులు పతియొద్దీన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు గుంతలు పూడ్చి వేత



రోడ్డు గుంతను పూడ్చివేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలో గత కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్లన్నీ గుంతల మయం కావడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ అలీ షబ్బీర్ పట్టణంలో ఎక్కడ ఏ గుంతకనిపించకూడదని సూచన మేరకు సోమవారం రోడ్డు గుంతలను పూడ్చి వేయడం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలోని 26,45వ వార్డ్‌లోని రోడ్డు గుంతలను పూరించడం జరిగిందనీ, ఇటీవల కురిసిన వర్షాలకు బల్దియా పరిధిలోని ప్రధాన రోడ్లు దెబ్బతి న్నాయన్నారు. బల్దియా ఆధ్వర్యంలో గుంతలు పూడించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందని తెలిపారు. ఓ వైపు రోడ్లు బాగు చేస్తూనే వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేప డుతున్నాట్లు ఆమె పేర్కొన్నారు. పాంచ్ చౌరస్తా నుంచి వెళ్లే రహదారి, ఇస్లాంపుర గల్లీ తదితర చోట్ల గుంతలతో అధిక సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించామని, వీటిని మున్సిపల్ సిబ్బందితో పూడ్చి వేయిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ పిట్ల వేణు గోపాల్, హనుమాన్ల మానస సురేష్, సానిటేషన్ ఎస్సై పర్వేజ్, జవాన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గండిపేట గ్రామంలో ఆదివారం వేకువ జామున ఒంటిగంటకు నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో వెళ్లి గండివేట జవాన్ యూత్ గణేష్ మండపం దగ్గర పేకాట బెట్టింగ్ పెట్టి ఆడుతున్నా ఆరుగురిని (కిష్టపురం కాశిరామ్, సందీప్ తన్నీరు, ఆంజనేయులు, నూతిలకంటి సాయిరాం, సంతోష్ కుమార్, చాకలి పాపయ్యలను అదుపులోకి తీసుకొని రూ.1,910 వదలు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఉదయం అందజ నాలుగు గంటలకు ఎస్ఐ నమ్మదగిన సమాచారం వచ్చిన మేరకు సిబ్బంది యుక్తంగా గండివేట్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆఫీసు ఎదురుగ మిత్ర యూత్ అసోసియేషన్ గణేష్ మండపం వద్ద పేకాట ఆడుతున్న భైరి సంగయ్య, కాషాగౌడ్ గాంధారి, బ్యాగరి కాశీరాం, దండు సంతోష్, రాజేందర్ భీమనపల్లి రాజేందర్ మొదలగు వారిని అదుపులోనికి తీసుకొని రూ.27,550 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అంజనేయులు మాట్లాడుతూ.. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు జూదం, డ్రగ్స్ గంజాయి నేరాలకు గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిపై ప్రత్యేక దృష్టిపెట్టి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వారిని కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేకంగా ఎవ్వరు వ్యవహరించిన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు.

చిన్న పిల్లల వైద్య శిబిరం



చిన్నారులకు వైద్యం చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేటలో ఆర్కే హాస్పిటల్ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 130 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలకు పలు సూచనలు చేశారు. భవిష్యత్తులో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఎదుగు తేనే, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించ గలుగుతమని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు కే.రమేష్, సిబ్బంది శేఖర్, గ్రామస్తులు సూర్య గంగాధర్, కుమ్మరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న మహిళా కోఆర్డినేటర్ లలిత

నవతెలంగాణ-కామారెడ్డి

హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ ప్రొటెక్షన్ కమిటీ కామారెడ్డి జిల్లా కార్యాలయన్ని ఆదివారం ప్రారంభించారు. హ్యూమన్ రైట్స్ కామారెడ్డి జిల్లా మహిళా కోఆర్డినేటర్ దొమ్మాటి లలిత మాట్లాడుతూ ఈ ప్రొటెక్షన్ కమిటీ రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ఉమెన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ ప్రొటెక్షన్ కమిటీ తెలంగాణ అనుబంధంగా పనిచేస్తుందని అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో అశోక్ నగర్ లో గల సందీపని డిగ్రీ కళాశాల, శ్రీకృష్ణ ధ్యాన మందిర్ దగ్గరలో తన తల్లిదండ్రులు యాదమ్మ- నర్సయ్యచేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. సమాజంలో సామాన్యులపై జరుగుతున్న అక్రమాలు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు, అభాగ్యులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడానికి రైట్ ఇన్ఫర్మేషన్ ఉమెన్ రైట్స్ సెల్ప్ అసోసియేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉమెన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ ఖలీల్ హుల్ల, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ముధం శంకర్ పటేల్, జిల్లా జనరల్ సెక్రెటరీ సుభాష్, తెలంగాణ మాదిగ హక్కుల పోరాట సమితి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బలరాం, బంజారా సంగము జిల్లా అధ్యక్షులు రూప్ సింగ్, బట్టు శ్రీనివాస్ , నందకుమార్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ



మహేష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

టిపిసిసి అధ్యక్షుడిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన మహేష్ కుమార్ గౌడ్ ను మండల కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలంటే, గ్రామాల నుండి బలోపేతం చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గీ రెడ్డి మహేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి చందర్ నాయక్, మాజీ సర్పంచ్ రెడ్డి నాయక్, మండల నాయకులు రఘోత్తమ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు అనంత పద్మనాభ స్వామి చతుర్దశి వేడుకలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయంలో రేపు మంగళవారం చతుర్దశి వేడుకలు చేపట్టనున్నట్టు ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. వేడుకలను పురస్కరించుకొని ఆలయానికి రంగులు వేయించారు. ఉదయం నుంచి జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి కోటి వత్తులు వెలిగించనున్నట్టు తెలిపారు. వత్తులు వెలిగించడానికి వచ్చిన భక్తుల కోసం ఆలయ నిర్వహకులు అన్నదానం నిర్వహించనున్నారు.

గణేశ్ మండపాల వద్ద మహా అన్నదానం

నవతెలంగాణ-మద్నూర్/కామారెడ్డి/ఎడపల్లి

మండల కేంద్రంలోని రతంగల్లిలో గల శ్రీ లక్ష్మీ నారాయణ మందిర్ ఆవరణంలో ఏర్పాటు చేసిన శ్రీ శెత్కరి గణేష్ మండలి మండపం వద్ద ఆదివారం మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. 11 రకాల వంటకాలతో భోజనాలు పెట్టారు. ఈ అన్న ప్రసాద కార్యక్రమానికి మండల కేంద్ర ప్రజలు వేలాదిగా తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన పోలీసు సిబ్బందికి శ్రీ లక్ష్మీ నారాయణ టెంపుల్ చైర్మన్ సందూర్ వార్ హనుమాన్లు శ్రీ శెత్కరి గణేష్ మండలి పాలకవర్గం సభ్యులు పోలీసులకు ఘనంగా శాలువాలతో సత్కరించారు. నిమజ్జనం రోజు ఈ విధంగానే మీరంతా సహాయ సహకారాలతో శాంతియుతంగా జరుపుకోవాలని పోలీస్ సిబ్బంది గణేష్ మండలి పాలకవర్గానికి సూచించారు.

కామారెడ్డి : పీస్ ఫెడరేషన్ గణేష్ మండలి 9వ వార్డ్ కామారెడ్డి పట్టణం, కల్కి నగర్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుంకుమ పూజా కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం కల్కినగర్‌కు చెందిన ఉపాధ్యాయులైన కూరపాటి శ్రీలత నరసింహం, పీస్ ఫెడరేషన్ సభ్యుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు పోతరాజు వెంకటేశ్ పెరిక, అభయ ఆంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షులు అంబీర్ రాజేందర్, డాక్టర్, పోచయ్య, రమేష్‌గౌడ్, నర్సింలు, చంద్రమౌళి, లింగం, భూమయ్య, హరినాథ్ రమేష్ జీవన్, వంశీ, చారి, భరత్, కాలనీవాసులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని పలు గ్రామాలలో వినాయక మండపాలలో నిర్వాహకులు దాతల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర గణేష్ మండలి కట్కామ్ శంకర్ దంపతులు, కుటుంబ సభ్యులు వీరభద్ర గణేష్ మండలి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ వీరభద్ర గణేష్ మండపాలో, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హైబ్రిడ్ గణేష్ మండపం వద్ద అన్నదానం..

మండలంలోని మంగల్ పాడ్ గ్రామంలో హైబ్రిడ్ గణేష్ మండపాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందుగా మండపాల నిర్వాహకులు యువకులు భక్తులు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదాంతరం స్థానిక మహిళా భక్తులు, యువకులు, గ్రామ పెద్దలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇల్లెందుల



మద్నూర్‌లో పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మర్కజి మిలాద్ కమిటీ, మదీనా మసీద్ ఆధ్వర్యములో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో భాగంగా 74 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. గత నాలుగు సంవత్సరాల నుండి మెగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని నిర్వాహకులకు రక్తదాతలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కామారెడ్డి రక్తదాతల సమూహం,ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్ (ఐవిఎఫ్) తరపున అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావలిస్తే అందజేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని ఐవీఎస్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మత పెద్దలకు నిర్వాహకులకు తెలియజేశారు. పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానానికి యువత ముందుకు రావడం అభినందనీయమని,రక్తదానం ప్రాణదానంతో సమానమేనని, రక్తదానానికి ముందుకు వచ్చిన యువతకు అభినందనలు తెలిపి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మిలాద్ కమిటీ అధ్యక్షులు ఖదీర్, సమీర్, అన్వర్, ముజాహిద్, సజ్జాద్, ఆమెన్, యాసీన్, మస్రత్,అస్రార్,మహమ్మద్ అజ్మత్,పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి,రెడ్ క్రాస్ డివిజన్ సెక్రెటరీ జమీల్ హైమద్,మత పెద్దలు పాల్గొనడం జరిగింది.



సర్టిఫికెట్ అందుకుంటున్న రక్తదాత

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని తాడ్వాయి మండలంలో నిర్వహించిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య ఏఐఎఫ్‌డిబ్ల్యూ జిల్లా జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ నీలా అధ్యక్షతన నిర్వహించారు. ఈ జనరల్ బాడీ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కుంభం సుకన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, జరుగుతున్న అత్యాచారాలను, ఆత్మహత్యలను నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. మహిళల భద్రతకు ఎన్ని చట్టాలు వచ్చినప్పటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సామాజిక వర్గానికి చెందిన మహిళలకు అయితే ఒక న్యాయం, ఉన్నత వర్గాలకు చెందిన వారికి ఒక న్యాయం చేయడం సరికాదన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళలు సంఘటితమై ఆడవాళ్ళపైన జరుగుతున్న దాడులను కలిసికట్టుగా ఉండి పోరాడి మహిళా చట్టాలను సాధించాలని అన్నారు. సమావేశంలో నూతన కమిటీని 15 మందితో ఎన్ను కోవడం జరిగింద న్నారు. జిల్లా కన్వీనర్‌గా మాలోత్ అర్చన, కొకన్వీనర్‌గా నాగమణి, రాష్ట్ర కమిటీ సభ్య రాలుగా శివాని, జిల్లా కమిటీ సభ్యులుగా సుజాత, లీల, పద్మ, అనార్యలి, మంజుల, బట్టు లక్ష్మి, సత్యవా తదితరులను ఎన్ను కోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామ్రేడ్ నీలా

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-బోధన్

లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ , లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో ఆదివారం జాడి జమాల్‌పూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ కుమ్మరి పోశెట్టి , రీజినల్ సెక్రటరీ సూరాబత్తుని శ్రీనివాసరావు, లేళ్ల శైలజ , కంటి వైద్యులు డాక్టర్ నెరేళ్ళ సతీష్ , మజార్, లేళ్ల బాలశౌరి గ్రామస్థులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన పలువురు వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న బాధితులకు బీఆర్ఎస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న 10 మందికి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కృషితో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశామని అన్నారు. ఈ సందర్భంగా బాధితులు చెక్కుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కట్కం సాగర్,చిలుక కిషన్,భూషనవేణి గంగాధర్ పాల్గొన్నారు.



సెప్టెంబర్ 17న విలీన దినోత్సవంగా నిర్వహించాలి

- సీపీఐ

నవతెలంగాణ-కోటగిరి/నిజామాబాద్‌సిటీ

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటుచేసిన అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, మండల కార్యదర్శి ఏ.విటల్ గౌడ్ మాట్లాడుతూ.. ఈనెల 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ 76వ వారోత్సవ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటి నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ జరిగిన పోరాటంలో ఎందరో అమరులైనారని వారి త్యాగాన్ని గుర్తిస్తూ ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17న భారత దేశంలో తెలంగాణ ప్రాంతం విలీనాన్ని అధికారికంగా జరపడం సంతోషకరమైన విషయమని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భూమికోసం, భుక్తి కోసం, మాతృభూమి విముక్తి కోసం జరిగిన పోరాటంలో నాలుగువేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు బలైనారని, వారి త్యాగ ఫలితమే నాటి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు నల్లగంగాధర్, బర్ల సునీల్ కుమార్, బుడాల రాములు, శరత్, గొడుగు హనుమాన్లు, సోమ సంజీవ్, నాగేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : సెప్టెంబర్ 17 న విలీన దినోత్సవంగా నిర్వహించాలి అని సిపిఐ పార్టీ నగర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాటాడుతూ. తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయాలని, దున్నేవానికి భూమి కావాలని, ఈ ప్రాంత ప్రజల పట్ల నిజాం నిరంకుశ వైఖరికి నిరసనగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. లక్షలాది మంది ప్రజలను నిజాం, రజాకార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజల్ని ఐక్యం చేసి పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐది అన్నారు. కానీ బిజెపి నాయకులు తెలంగాణ విలీన దినోత్సవ చరిత్రను వక్రీకరించి అమరుల త్యాగాలను పక్కన పెట్టి హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నిజాంకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో అనేకమంది ముస్లిం మేధావులు పాల్గొని జైలు పాలై అసువులు బాసిన వారు ఉన్నారని తెలిపారు. బిజెపి నాయకులు చరిత్రను తెలుసుకొని ప్రజలకు వివరించాలి తప్ప వక్రీకరించి మాట్లాడటం మానుకోవాలని హితో పలికారు. 17న పార్టీ కార్యాలయంలో విలీన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ. సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర నాయకులు పి నర్సింగరావు, హనుమాన్లు, దేవేందర్, రాజశేఖర్, యూసుఫ్, రఫీక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

లడ్డు దక్కించుకున్న సృజల్



వేలం పాటలో లడ్డు దక్కించుకున్న సృజన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఖానాపూర్‌లోని గణేష్ మండలి దగ్గర లడ్డు లక్కీ డ్రాలో పెద్ద అబ్బు సృజల్‌కు దక్కింది. ఈ లక్కీ డ్రాలో వేలం లేకుండా 20 రూపాయల రసీదుతో రావడం చాలా ఆనందంగా ఉందని సృజల్ తెలిపారు.

దండిగుట్టలో ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దండిగుట్ట గ్రామంలో ఆదివారం వినాయక నిమజ్జన శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన పేదల గుండా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు కోలాటాలతో ఆకర్షించారు. అనంతరం కల్యాపూర్ చెరువులో గణనాథుడిని నిమజ్జనం చేశారు. అనంతరం గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముళ్ళపూడి శ్రీదేవి కృష్ణారావు, ధనుంజయ్, జగదీష్, నరసింహారెడ్డి, వెంకటేశ్వరరావు, చుట్ట శ్రీనివాస్, వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

లడ్డు.. లక్ష పదివేల ఒక వంద

- కొత్తపల్లిలో వేలం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్కు వెంకటరెడ్డి వినాయకుని లడ్డు లక్ష పదివేల ఒక వంద రూపాయలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఇంత ధర పలకడం మొట్టమొదటిసారి జరిగిందని భక్తులు పేర్కొన్నారు.



స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-వర్ని

తోటి స్నేహితులు మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా నిలబడ్డారు చిన్ననాటి స్నేహితులు, వర్ని(వడ్డేపల్లి) బాయ్స్ హై స్కూల్ ఎస్ఎస్‌సీ 2001-2002 బ్యాచ్ విద్యార్థులు 60 వేల రూపాయలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. తగలేపల్లి గ్రామానికి చెందిన బి.సిద్దులు, రాములు, వేగుల వినోద్ కుమార్ (చిన్న) ఎస్.ఎన్.పురం) 20వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో పిల్లల చదువులకు ఆర్థికంగా ఆదుకుంటామని, కుటుంబసభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముగ్గురు మిత్రులను కోల్పోవడం చాలా బాధాకరమని తోటి స్నేహితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశ్నారు. న్యాయవాది బాణోత్ రమేష్, మొబైల్ మైసం శ్రీను, వడ్ల.భాస్కర్ (ఆర్మీ), దడ్ల రాజు ఎలక్ట్రీషియన్, గైని గోపి సీపీఎం, భీమా, పి.ఈటీ శ్రీను, మొబైల్ బి.గణేష్, షైక్ వెల్డింగ్ షాప్ షేక్ సాధక్, సౌన్ కాంబ్లే సంజీవ్, గుజ్జరవీందర్, గుజ్జ సాయిలు, డి.రాజు ఫూట్ వేర్, మిల్క్ సెంటర్ జి.కృష్ణమూర్తి, చికెన్ సెంటర్ సతీష్ ఉన్నారు.

శ్రీ రామకృష్ణ సేవా సమితి గణపతి శోభాయాత్ర

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రం లోని శ్రీ వివేకానంద హైస్కూల్ ప్రాంగణంలో రామకృష్ణ సేవా సమితి సౌజన్యంతో పాఠశాలలో ఏర్పటుచేసిన వినాయకుడిని ఆదివారం నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ శోభాయాత్రలో పాఠశాల విద్యార్థులు వినాయకుడి ముందు కోలాటాలు వేస్తూ నృత్యాలు చేస్తూ డీజే పాటలతో వినాయకుడి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం వినాయకుడిని దామరచెరువులో నిమజ్జనం చేశారు.



సదానంద్ పంతులుకు సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలం మంగల్ పహాడ్ బాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో పంతులుగా పనిచేస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో నెలకొల్పిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని గ్రామ యువకులు, పెద్దలు సన్మానించారు. శ్రీ రామ గణేష్ మండలి వద్ద పూజలు నిర్వహిస్తున్న సదానందును, మాణిక్యాల సురేష్ గౌడ్ దంపతులు శాలువతో సత్కరించారు, కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, అరుణ్ గౌడ్, రామకృష్ణ గౌడ్, బండ గంగాధర్, రాజేందర్, గడ్డం గంగాధర్, హస్సేన్, రమేష్ గౌడ్, విద్యుత్ శాఖ లైన్మెన్ బాలరాజ్ పాల్గొన్నారు.

శ్రీ బాల రామ గణేష్ మండపాన్ని సందర్శించిన పోలీస్ అధికారులు మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోని మూడవ వార్డులో శ్రీ బాల రామ గణేష్ మండపాన్ని బోధన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్ తో పాటు ఎడపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ వంశీ కృష్ణారెడ్డి సందర్శించారు. గ్రామంలో నిమజ్జనంతో పాటు నవరాత్రి ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని వారన్నారు. చట్టాన్ని ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.



పంతులును సన్మానిస్తున్న పలువురు

శ్రీయువజన గణేష్ మండలి వద్ద అన్నదానం

నవతెలంగాణ-నిజామాబాద్

శ్రీయువజన గణేష్ మండలి వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. అంతకుముందు గణేషునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న బిల్ కలెక్టర్ మహేష్ దంపతులు, భక్తులు



పూజలు నిర్వహిస్తున్న మండలి సభ్యులు

మిమిక్రీ శంకర్‌కు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోచంపాడ్‌లో జలవిద్యుత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు భాగంగా మిమిక్రీ శంకర్‌తో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిమిక్రీ శంకర్ మిమిక్రీ మాట్లాడే బొమ్మ తో చిన్నపిల్లల గేమ్స్ డాన్సులు, స్టార్ మహిళ కపుల్ గేమ్స్ నిర్వహించి ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నారు. అనంతరం ఆయనకు గణేష్ ఉత్సవాల సందర్భంగా ఘనంగా సన్మానం నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. కమిటీ చైర్మన్ జై శ్రీనివాస్, కన్వీనర్ డిఇ ప్రవీణ్, సభ్యులు సురేష్, భరత్, శివరాం, మహేష్, గంగాధర్, శివరాం, మిమిక్రీ శంకర్ మిత్రుడు రవీందర్ తో పాటు సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



సన్మానించిన పలువురు

ఘనంగా వినాయక నిమజ్జన ఉత్సవాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను డీజే చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాల మధ్య ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ శివారులోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలో వరద కాలువలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జనంతో గ్రామాల్లో సందడి నెలకొంది. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు. వినాయక నిమజ్జన ఉత్సవాలపై గ్రామాల్లో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి, నిమజ్జన ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ఇప్పటికే వినాయక మండపాల నిర్వాహకులకు పోలీసులు అవగాహన కల్పించారు.

వినాయక మండపాల వద్ద అన్న వితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని పలు వినాయక మండపాల వద్ద ఆదివారం అన్న వితరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. హస కొత్తూర్ రోడ్‌లో, ఎస్సీ కాలనీ, గాంధీనగర్ ఇందిరమ్మ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద అన్నదానం

బోధన్ : బోధన్, సాలూర మండలాల్లో ఆదివారం వినాయక మండపాల వద్ద భక్తులు జోరుగా అన్నదానాలు చేశారు. ఈ సందర్భంగ వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ భజన కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో 9వ రోజు సందర్భంగ నిమజ్జనం చేశారు.

గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్



నిమర్జనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద ఆదివారం గణేష్ నిమజ్జన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొని పూజలు చేసి గణేష్ నిమజ్జనం చేశారు. ప్రజలు కూడా తమ ఇళ్లల్లో పూజించుకున్న గణేషుడికి కుటుంబ సభ్యులతో పూజలు చేసి నిమజ్జనం చేశారు. ఈ సంవత్సరం అంతా ప్రజలకు మంచి జరగాలని విఘ్నేశ్వరుడిని కోరుకున్నామని చైర్ పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

మండల టాపర్లకు ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉర్దూ మీడియంలో మండల ర్యాంక్ సాధించిన హుమేర జైనాబ్, మిస్బా మహీన్‌కు ఆల్ ఇండియా ఐడల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ పట్టణంలో వారికి ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యాకీనుద్దీన్, జిల్లా అధ్యక్షులు లాయస్ హైమద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్కే ఆరిఫ్ ఖాజా ఖలీల్, ముఖ్య అతిథులు నయూముద్దీన్, ఆస్మాజరిన్, జడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ కరీం పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు

శాంతియుతంగా గణేష్ నిమజ్జనం నిర్వహించుకోవాలి

- బాల్కొండ ఎస్ఐ బి.నరేష్

నవతెలంగాణ-బాల్కొండ

గణేష్ నిమజ్జనం సందర్భంగా మండల పరిధిలోని ప్రజలు, భక్తులు గణేష్ నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలని ఆదివారం బాల్కొండ ఎస్ఐ బి. నరేష్ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. మండల పరిధిలోని గ్రామాలలో గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా ప్రతి గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ బి.నరేష్ తెలిపారు.

సద్దుమణిగిన వివాదం

- శివాజీ విగ్రహానికి లైన్ క్లియర్



మాట్లాడుతున్న పోలీసులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో పాత జాతీయ రహదారికి అనుకోని ఉన్న మార్కెట్ యార్డ్ స్థలం వద్ద శివాజీ విగ్రహం ఏర్పాటు విషయంలో మైనార్టీ వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేసిన సందర్భంలో ఆదివారం ముప్కాల్ గ్రామస్తులు చేపట్టిన నిరసనతో కొద్దిసేపు యుద్ధ వాతావరణం నెలకొంది. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీకి మూడు రోజుల కిందట స్థానిక ముస్లిం సోదరులు శివాజీ విగ్రహం ఏర్పాటు విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాత పూర్వకంగా రాసి ఇచ్చారు. దీంతో గ్రామస్తులు, శివాజీ యూత్, భజరంగ్ దళ్ సభ్యులు నిరసన తెలిపారు. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, సీఐ శ్రీధర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఇరువర్గాల వారితో మాట్లాడి సమస్యను సద్దుమణిగించారు. వీరికి తోడు రెవిన్యూ సిబ్బంది డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్ సమస్య పరిష్కారంలో తమవంతు పాత్ర పోషించారు. ముప్కాల్, బాల్కొండ, మెండోరా, వేల్పూర్, మోర్తాడ్ ఎస్సైలతో పాటు మరికొంతమంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాలు పంచుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శివాజీ విగ్రహ ఏర్పాటు సమస్య పరిష్కారం కావడంతో మండల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, శివాజీ యూత్ సభ్యులు, భజరంగ్ దళ్ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు, యువజన సంఘం నాయకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

వివి నగర్ కాలనీలో గణేశుని వద్ద ఆటల పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 18వ డివిజన్ ముబారక్ నగర్‌లోగల వివి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ఆదివారం ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా వివి నగర్ కాలనీలో వినాయకుడిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వినాయకుని వద్ద మహిళలకు ప్రతి సంవత్సరం ఆటల పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బుస్సా ఆంజనేయులు, భూపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సాగర్, సుదర్శన్, బిఎస్ఎన్ఎల్ గంగారం సావిత్రి, కాలనీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్ ప్రసాద్



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నూతన రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా పెంటు శ్రీనివాస్ ప్రసాద్ నియామకం, శ్రీనివాస్ ప్రసాద్ నిర్మల్ జిల్లా కుంటాల మోడల్ స్కూల్ నుంచి బాల్కొండకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన శంకర్ రెంజల్ మోడల్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. 2017లో మోడల్ స్కూల్ ప్రారంభం నుంచి శంకర్ ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రెండు తులాల బంగారం, 50 వేల నగదు అపహరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిందని ఎస్ఐ గంగాధర్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బాబన్ సాహబ్ పహేడుకు చెందిన షేక్ అబ్బుత్ అలీక్, అతని భార్య ముస్కాన్ బేగం కలిసి మూడు రోజుల క్రితం వారి తల్లి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు షేక్ అబ్బుత్ అలీక్ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసుకొని గణపతి మండపం అలంకరణ కోసం వెళ్లినట్లు తెలిపారు. అయితే తిరిగి ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. గుర్తుతెలియని దొంగలు ఇంట్లో చొరబడి బీరువా పగలగొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారం, రూ.50వేల నగదు అపహరించినట్లు పేర్కొన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

జీపీ నుంచి వీడీసీ భూమి పేపర్లుమాయం

- 1995లో 10 గుంటల పట్టా భూమి కొనుగోలు
- కొనుగోలు చేసిన పేపర్లు జిపిలో పెట్టిన వీడీసీ సభ్యులు
- 2017లో దొంగ పేపర్లతో రిజిస్ట్రేషన్, ధరణి ఆన్‌లైన్
- భూమి చదునుతో బయటపడిన దొంగ రిజిస్ట్రేషన్
- పేపర్లు మాయం చేసిన దొంగ ఎవరు..?

నవతెలంగాణ-భిక్కనూర్

గ్రామానికి సంబంధించిన ప్రతి వివరాలు గ్రామపంచాయతీలో ఉంటాయి. పంచాయతీలోనే వీడీసీ పేపర్లు భద్రంగా ఉంటాయని నమ్మకంతో.. 1995 సంవత్సరంలో అప్పటి వీడీసీ సభ్యులు కొనుగోలు చేసిన 10 గుంటల భూమి పత్రాలను గ్రామపంచాయతీలో భద్రపరిచారు. కొనుగోలు చేసిన భూమి ఎక్కడికి పోతుందిలే పత్రాలు అయితే గ్రామపంచాయతీలో ఉన్నాయి కదా అని ధైర్యంగా ఉన్న వీడీసీ సభ్యులకు కొనుగోలు చేసిన 30 సంవత్సరాల తర్వాత భూమి చదును చేయడంతో అనుమానం వచ్చింది. తీరా వెళ్లి ఆరా తీయగా గ్రామపంచాయతీ నుంచి మాయమైన భూమి పత్రాలు, కొనుగోలు చేసిన వ్యక్తి వివరాలు పూర్తిగా బయటపడ్డాయి. పత్రాలు లేని కారణంగా జిపి నుంచి పత్రాలు మాయం చేసిన దొంగ ఎవరు, దొంగ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన వ్యక్తులు ఎవరు అన్న వివరాలు బయటకు తీయడానికి వీడీసీ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు.

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో 1995 సంవత్సరంలో అప్పటి వీడీసీ సభ్యులు రేషన్ షాపులో చెక్కర ద్వారా, గ్రామం ద్వారా సేకరించిన తలా ఒక్క రూపాయి పోగుచేసి చర్చి సమీపంలో 10 గుంటల భూమిని చింత ఫ్యామిలీ నుండి కొనుగోలు చేశారు. బాండ్ పేపర్ ద్వారా రాసిన పత్రాలు భద్ర పరచడానికి వీడీసీ సభ్యులు గ్రామ పంచాయతీలో అయితే భద్రంగా ఉంటా యని భద్రప రిచారు. అప్పటి వీడీసీ అధ్యక్షులు వెంకటేశం, సర్పంచ్ రాములు మరికొందరు వ్యక్తులు కొనుగోలు చేసిన భూమి స్థలంలో ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నిర్మించాలని అనుకున్నారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వ సహకారంతో గెస్ట్ హౌస్ నిర్మించాలని గతంలోనే మహమ్మద్ షబ్బీర్ అలీ, గంప గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణం చేపడతామని అనుకున్నా కాలయాపన కారణంగా నిర్మాణం చేపట్టలేదు.


ప్రస్తుతం 10 గుంటల భూమిలో కొందరు వ్యక్తులు చదును చేయడంతో వీడిసి భూమి దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయాలు బయటకు వచ్చాయి. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు, అప్పటి వీడీసీ అధ్యక్షులు వెంకటేశం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 10 గుంటల భూమి 1995 సంవత్సరంలో కొనుగోలు చేసినట్లు ఆ పత్రాలు జిపిలో భద్రపరచడం జరిగిందని 2017 సంవత్సరంలో సాదా బైనామా పత్రాలు ధరణి పోర్టల్‌లో నమోదు చేస్తున్న కారణంగా అప్పుడే గ్రామపంచాయతీలో ఉన్న వీడీసీ కొనుగోలు చేసిన పత్రాలు మాయం చేసి చింత ఫ్యామిలీకి సంబంధించిన వ్యక్తుల ద్వారా సుదర్శన్ అనే వ్యక్తి రిజిస్ట్రే షన్ చేసుకున్నట్లు తెలిపారు.

" నవతెలంగాణ " వీడీసీ భూమిపై వివరాలు సేకరించగా ప్రస్తుతం కొనుగోలు చేసిన వ్యక్తి కేవలం ధరణిలోనే సాదా బైనామా ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వివరాలు సేకరించగా రిజిస్ట్రేషన్ కాలేదని తెలిసింది. చింత వారి ఫ్యామిలీకి 36 గుంటల భూమి ఉండగా వారి కుటుంబ సభ్యులు ముగ్గురు అన్నదమ్ములు చంద్రయ్య, వెంకటయ్య, సత్తయ్యలకు 12 గుంటల చొప్పున భూమి వస్తుంది. చంద్రయ్య కుమారుడు నర్సింలు 12 గుంటల భూమి అమ్ముకున్నట్లు సమాచారం. వెంకటయ్య, సత్తయ్యలలో ఎవరు వీడీసీకి 1995లో భూమి అమ్మకం చేశారో తెలియాల్సి ఉంది. వాస్తవానికి వందకు వందశాతం వీడీసీ కొనుగోలు చేసిన 10 గుంటల భూమి వాస్తవమేనని గ్రామస్తులు, గ్రామ పెద్దలు తెలియజేస్తున్నారు.

దొంగతనంగా రిజిస్ట్రేషన్ ఎవరు చేశారు. అసలు 1019 సర్వే నెంబర్ మొత్తం విస్తీర్ణం ఎంత ఎవరు భూమి ఎక్కడ ఉంది..?, దొంగ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తి ఎవరు..? రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి వద్ద పత్రాలు ఎలా వచ్చాయి..? సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ధరణి పోర్టల్‌లో వివరాలు ఎలా నమోదు చేశారు. అన్న విషయాలు పూర్తి భూమిని సర్వే చేస్తే తప్ప దొంగ రిజిస్ట్రేషన్ నా..? కాదా..? అన్న వివరాలు బయటకు వస్తాయి. గ్రామపంచాయతీలో భద్రంగా ఉంటాయి అనుకున్న పేపర్లు జిపి నుంచి మాయం అవడంతో అప్పటి గ్రామపంచాయతీ పాలకవర్గం, పంచాయతీ సిబ్బందిపై వీడీసీ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



వీడీసీ కొనుగోలు చేసిన భూమి





భూమికి సంబంధించిన ధరణి పోర్టల్, పహాని నకలు

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు.. సమస్యలకు నిలయాలు

- చేపట్టని మురుగు కాలువల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ - భీంగల్‌రూరల్

ఇండ్లు లేని నిరుపేదల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రంలో 288 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం చేపట్టారు. అనువైన స్థలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా ఇండ్ల చుట్టూ వర్షపు నీరు నిలుస్తున్నాయి. దీంతో 288 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేసినప్పటికీ సరైన మౌలిక వసతులు లేక పోవడంతో 180 మంది లబ్ధిదారులు మాత్రమే ఇండ్లలో నివాసం ఉంటున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ డ్రైనేజీ కనెక్షన్లు లీకేజీ అవుతున్నాయని ఆరుబయట కాలకత్యాలు తీర్చుకుంటున్నారు. మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో నీరు ఇంటి ముందు, వెనక నిలవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతూ రోగాల బారిన పడుతున్నారు. పిచ్చి మొక్కలతో నిండిన ఖాళీ స్థలం ఉండడంతో ఇళ్లలోకి పాములు విషపురుగులు వస్తుండ డంతో భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో పూర్తి సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



డబుల్ బెడ్‌రూంలవద్ద నిలిచిన నీరు

అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ఉంటున్నాం: లబ్ధిదారులు

డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వచ్చినప్పుడు అక్కడి పరిసరాలు బురద మయం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షపు నీరు ఇండ్ల చుట్టూ నిలవడంతో పాటు,రాత్రి వేళలో పాములు, విష పురుగులు ఇండ్లలోకి వచ్చి చేరడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం గడుపుతున్నాం. వర్షపు నీరు ఇంటి ముందే నిల్వ ఉండడంతో రోగాల బారిన పడ్డాం. స్థానిక ప్రజా ప్రతినిధులకు సమస్యను వివరించినప్పటికీ ఎవరు పట్టించుకోలేదు.



సత్కారం అందుకుంటున్న జిల్కార్ నయన్

జిల్కార్ నయన్‌కు సత్కారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జేసీఐ జోన్ 12లో జేసీఐ జోన్ అధికారిగా వ్యవహరిస్తున్న నగరానికి చెందిన జిల్కార్ నయన్‌ను జేసీఐ ఇండియా అధ్యక్షులు రీకేశ్ శర్మ, జాతీయ పిన్‌తో సత్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నగరానికి చెందిన జిల్కార్ నయన్ సత్కరం అందుకున్నారు. అదే విధంగా పిఆర్ జోన్ అధికారి నికీల్ గుండా జేసీఐ ఇందూర్ నిర్వహించిన పబ్లిక్ రిలేషన్స్‌కు సంబంధించిన సేవల కార్యక్రమాలకు, ఇతర సమాజిక సేవలకు ఇంధూర్ అధ్యక్షులు మనోజ్ కుమార్‌కు ఉత్తమ ప్రతిభ ప్రశంస పత్రలను జాతీయ అధ్యక్షులు ద్వారా అందచేశారు. కార్యక్రమంలో జేసీఐ జాతీయ అధికారులు, రమేష్ దడిగల, వినయ్ మెహతా, నిధి గుప్త, కిరణ్ బంటు, జోన్ అధ్యక్షులు గోవింద్ కాంకాని, శ్రేయ దీక్షిత్, జయంత్, పాల్గొన్నారు.

కోతులు, కుక్కలతో భయం..భయం

- ప్రతిరోజు కుక్కకాటు కేసులు నమోదు
- లబోదిబోమంటున్న బాధితులు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఏ గ్రామానికి వెళ్లినా ఏ కాలనీకి వెళ్లిన ఒక పక్క శునకాలు, ఇంకో పక్క కోతులు హంగామా చేస్తూనే ఉన్నాయి. ప్రజలకే కాకుండా మేకలు, గొర్లను సైతం కరుస్తున్నాయి. ఈ కేసులు ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వందలాదిగా నమోదవుతూనే ఉన్నాయి. ఇంతే కాకుండా గృహాల్లోకి చొరబడి హంగామా సృష్టిస్తున్నాయి. ఒక్కటి కాదు.. రెండు కాదు వందల సంఖ్యలో ఒకేసారి కోతులు వస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీటికి తోడు శునకాలు కూడా ఎక్కువ కావడంతో ఇటు ద్విచక్ర వాహనదారులు రహదారులను వెంబడించడంతో పలు ప్రమాదాలకు ద్విచక్ర లోనవుతున్నారు. గొర్లు, మేకల కైతే వదలడంలేదని యజమానులు లబోదిబో మంటున్నారు. వాటిని చంపవద్దనే నిబంధనలు, ఆదేశాలు ఉండడంతో గ్రామ పంచాయతీలు, గ్రామాభివృద్ధి కమిటీలు కూడా వెనుకడుగు వేస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం వాటిని నియంత్రించే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాదితులు వాపోతున్నారు. వాంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఇకనైనా ప్రభుత్వం కుక్కలను, కోతులను నియంత్రణ చేయడానికి పకడ్బందీ ప్రణాళిక చేసి నష్టం వాటిల్ల కుండా చుడాలని బాధితులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి, అధికారులకు వేడుకుంటున్నారు.

జనావాసాల్లో కోతులు.. భయాందోళనలో ప్రజలు

కోతులు జనావాసాల్లోకి రావడంతో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు భయం భయంతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. గతంలో ఇందల్‌వాయి , డిచ్ పల్లి మండలాల్లోని గ్రామస్తులంతా ఏకమై రోజుకు కొందరు చొప్పున కోతులను గ్రామం నుండి తరిమే కార్యక్రమం చేపట్టారు. ఇంకొన్ని గ్రామాల్లో ఒక్క కోతికి ముడు నుంచి ఐదు వందల రూపాయలు వెచ్చించి కొన్ని రోజులు ప్రశాంతంగా ఉన్నారు. తర్వాత కొన్ని రోజులు కాగానే మళ్ళీ యథాతథ స్థితికి వచ్చేస్తున్నాయి. కోతులు ఎక్కువ సంఖ్యలో ఉన్న గ్రామాల్లో కొందరు రైతులు మక్కలు, ఇతరత్రా పంటలు పండించేందుకు వెనుకంజ వేస్తున్నారు. మక్కలు వేస్తే మొత్తం పంటను కోతులు నాశనం చేస్తాయనే ఉద్దేశంతో వరి పంట పండిస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేల దృష్టికి రైతులు, ప్రజలు తీసుకెళ్లినా ఏమీ చేయలేని పరిస్థితి దాపురించిందని పలువురు పేర్కొంటున్నారు. మక్కబుట్టలు, కంకులు అమ్మేవారు, కిరాణ దుకాణదారులు, చిన్న చిన్న వ్యాపారస్తులు, హెూటల్ యజమానులు కోతులతో అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు.



ప్రభుత్వాసుపత్రిలో నమోదవుతున్న కేసుల సంఖ్య..

ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 16 పదహారు సబ్సెంటర్లు ఉన్నాయి. దీనిలో ఎక్కువ సంఖ్యలో కోతులు, శునకాల కేసులు అధికంగా వస్తున్నాయి. 2024 జనవరిలో 85, ఫిబ్రవరిలో 66, మార్చిలో 72, ఏప్రిల్‌లో 74, మేలో 56, జూన్‌లో 88, జులైలో101 కేసులు ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి లో నమోదైనట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఒక్క ప్రభుత్వ అసుపత్రిలోనే ఇన్ని కేసులు నమోదవుతున్నాయి. ఇంకా ప్రయివేటు ఆసుపత్రికి వెళ్ళే వారి లెక్కనే తేలటం లేదు. ఒక్కసారి కాటు వేస్తే ముడు సార్లు ఇంజక్షన్ ను తీసుకోవాల్సి ఉంటుంది.ప్రైవెట్ ఆసుపత్రులలో దాదాపు రెండువేల రూపాయలు వేచ్చించు కోవల్సి వస్తుందని బాధితులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో 16 సబ్ సెంటర్లలో .అనునిత్యం కేసులు లేని రోజుండదు. డిచ్ పల్లి మండల కేంద్రంలోని సిహెచ్సీ ఆసుపత్రిలో కుడా దీని కంటే అదనంగానే కేసులు నవోదవుతు ఉన్నాయి. ఒక్క అసుపత్రిలోనే ఏడు నెలల్లో 542 కేసులు వచ్చాయి. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, బాధితులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు వేడుకుంటున్నారు.

పంట పొలాలే కాదు.. నివాస గృహాలకు నష్టం..

చాలా గ్రామాల్లో వరి పంటనే రైతులు సాగు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు కన్నెత్తి సైతం చూడడం లేదు. దీనికి కారణం కోతులు ఇదే కాకుండా కూన పెంకుల ఇల్లు ఉంటే ప్రతి ఏటా దాన్ని మరమ్మతులు చేపట్టవలసిందే లేకపోతే అడుగడుగునా వర్ష కాలంలో ఇబ్బందులు తప్పడం లేదని, గత్యంతరం లేక పలు గ్రామాల్లో కూన పెంకుటిల్లుపై రేకులు, తాటి పత్రులు వేసుకుంటున్నారు.

మండలపాల్లో అన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్/ఎడపల్లి/బోధన్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ వినాయక రెసిడెన్సి యందు గణేష్ ఉత్సవాలలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినాయకులను దర్శించుకున్న మున్సిపల్ చైర్మెన్

బోధన్: పట్టణంలోని ప్రతిష్ఠించిన వినాయక మండపాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకులకు ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన శోభాయాత్ర శాంతియుతంగా జరుపుకోవాలని మండపాల నిర్వహకులకు సూచించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి కావలసిన ఏర్పాట్లు చేశారు. ఆమె వెంట కౌన్సిలర్ శరత్‌రెడ్డి, స్థానికులు ఉన్నారు.

ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ

- రూ.3 లక్షల 25వేలు చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రాంగి మండలం ఉమ్మడి మానాల గ్రామానికి చెందిన పలువురికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రిల్లో వైద్యం చేయించుకున్న పలువురు లబ్దిదారులు ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కృషి, సహకారంతో ఉమ్మడి మానాల గ్రామంలో 14 మంది లబ్దిదారులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆర్థిక సహాయ నిధి ద్వారా రూ.3లక్షల 25వేల విలువైన చెక్కులను మంజూరు చేసింది. అట్టి చెక్కులను బిఆర్ఎస్ పార్టీ రుద్రాంగి మండల అధ్యక్షులు దేగావత్ తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో స్థానిక టిఆర్ఎస్ నాయకులు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మానాల గ్రామ పరిధిలోని మాజీ సర్పంచ్‌లు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, అంబర్ సింగ్, భూమా నాయక్, జూల భూమన్న, లక్ష్మణ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు రామదాస్, నాయిని రాజేశం, వికతి రాజేశం, మలావత్ రవి, బాలు, గజన్ శర్మన్, తదితరులు పాల్గొన్నారు.

రథాన్ని అందించడం అభినందనీయం

- బోధన్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్




రథాన్ని అందజేసిన కందకట్ల రాంచందర్

నవతెలంగాణ-ఎడపల్లి

గణేష్‌ల నిమజ్జనానికి దుర్గ మాత నిమజ్జనానికి రథం ఉపయోగకరంగా ఉంటుందని బోధన్ రూరల్ సీఐ కోల నరేష్ అన్నారు. ఎడపల్లి గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు కందగట్ల రామచందర్ (అన్నా సేట్) సుమారు రూ.1.60 లక్షలు సొంత ఖర్చుతో రథాన్ని గ్రామానికి విరాళంగా అందించడం పట్ల సిఐ అభినందించారు. రథాన్ని మహాలక్ష్మి ఉత్సవ కమిటీ సభ్యులకు ఆయన ఆదివారం నయాబాదిలో అందజేశారు. కార్యక్రమంలో ఎడపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్, వంశీకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, శంకర్ నాయుడు ఎల్లయ్య యాదవ్, ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, రాజు గుప్తా, లింగేష్, కందగట్ల అంబయ్య, నాయుడు పోతన్న, మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ 50 వసంతాల లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పిడీఎస్‌యూ అర్ధ శతాబ్దం నిండిన సందర్భంగా 50 వసంతాల లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిజామాబాద్ నగరంలో పిడిఎస్‌యూ పూర్వ, ప్రస్తుత నాయకుల చేతుల మీద మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ రాష్ట్ర అధ్యక్షులు వి.భాస్కర్ మాట్లాడుతూ 1974 సంవత్సరంలో పిడిఎస్‌యూ ఏర్పడిందని, గత 50 ఏండ్ల కాలంలో విద్యారంగ సమస్యలపైన, శాస్త్రీయ విద్యా సాధనకు, సమ సమాజ స్థాపనకు, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం , విద్య ప్రైవేటీకరణ కార్పొరేటికరణకు వ్యతిరేకంగా పిడిఎస్‌యూ సంఘం పోరాడుతూ వస్తుందని అన్నారు. , అక్టోబర్ 24 న జరిగే పి.డి.ఎస్.యూ శతాబ్దోత్సవ సభను పూర్వ ప్రస్తుత పి.డి.ఎస్.యూ కార్యకర్తలు జయప్రదం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ పి.డి.ఎస్.యూ నాయకులు వి.భాస్కర్, పరుచూరి శ్రీధర్, దాసు, పోచయ్య, పురుషోత్తం, అరుణ, ఆకుల నారాయణ, రమేష్, సరిత,అన్వేష్, రవి, ప్రస్తుత పి.డి.ఎస్.యూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆర్.గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్,నాయకులు ప్రిన్స్,రవీందర్,నిఖిల్,శివసాయి,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.